# 10.

# ఇంద్రియ నియంత్రణ - దుఃఖ నివృత్తి

**కాతే కాంతాః కస్తేపుత్రః?**
**సంసారోయఽ మతీవ విచిత్రః**
**కస్యత్వంవా? కుత ఆయాతః?**
**తత్త్వం చింతయః తదిహభ్రాతః**
**ఎవతె భార్య ఇంకెవడో బిడ్డడు!**
**ఎంత చిత్రమో యీ సంసారము!**
**ఎవరివాడ వెవ్వడ వెటు వచ్చితివి?**
**తత్వమిక్కడె తమ్ముడ తెలియర!**

పవిత్రాత్మ స్వరూపులైన విద్యార్థులారా!

గడచిన ఎనిమిది దినములనుండి శంకరుల వారు రచించినటువంటి, తన శిష్యులు కూడను అందుకు కూడినటువంటి భజగోవింద శ్లోకముల యొక్క తత్త్వాన్ని మీకు వ్యక్తపరిచే నిమిత్తమై తరగతులు జరుగుతూ వచ్చాయి. సర్వ వేదముల యొక్క సారము, సమస్త శాస్త్రములయొక్క మూలము, సర్వధర్మములయొక్క కీలకము, సర్వజగత్తునందుండిన సర్వపదార్థముల గమ్యము కూడను ఒక పెన్నిధియైన భగవత్ సన్నిధియే అన్న తత్త్వాన్ని ఈ భజగోవిందము యొక్క శ్లోకములు మనకు స్పష్టపరుస్తున్నవి. ప్రకాశించే సూర్యునికి దట్టమైన మేఘములు అడ్డము వచ్చినప్పుడు భూమిపైనున్న ప్రజలకు సూర్యుడు కనిపించడు. అంతమాత్రము చేత సూర్యుడు లేడని చెప్పటానికి వీలులేదు. మలయమారుతము ప్రవేశించినప్పుడు ఆ మేఘము ప్రక్కకు నెట్టుకొని పోవటం చేత సూర్యుడు మనకు కనిపించుచున్నాడు. అటులనే ఆత్మస్వరూపుడైన ఆత్మ భాస్కరుడు మన అజ్ఞానమనే మేఘములు కప్పబడటంవల్ల మానవుడు తన స్వరూపమును తాను తెలుసుకొనలేక తాను అజ్ఞానములో మునుగుతున్నాడు. అట్టి సమయములో జ్ఞానము అనే గాలి వీచినప్పుడు అందులో ఈ మేఘములు చెదరిపోయి ప్రకాశవంతమైన ఆత్మ మన స్వస్వరూపాన్ని ధరించుచున్నది. అటులనే మానవుడు విషయ సంబంధమైన ప్రాకృతమైన

sri sathyasai vachanamrutam

భావములతో నిత్యసత్యమైన ఆత్మస్వరూపాన్ని విస్మరించి కేవలము జగత్తే సత్యము, నిత్యమని అజ్ఞానములో మునగటం వలన ఈనాడు ప్రజ్ఞాన సుజ్ఞాన విజ్ఞానమనే గాలులు అత్యవసరమై, ఆ గాలుల ద్వారా మనకు అడ్డమైనటువంటి ఈ అజ్ఞాన మేఘములను మనం దూరం గావించుకొని తద్వారా మన స్వరూపాన్ని మనం నిరూపించే పరిస్థితికి సంసిద్ధులు కావాలని నేను ఆశిస్తున్నాను.

**లౌకిక సంబంధములన్ని అశాశ్వతములే**

భర్త అనగా ఎవరు? ఎవరు భార్య? ఆమె మొట్టమొదట తల్లిదండ్రులకు బిడ్డవలె జన్మించి, తదుపరి నీకు అప్పచెప్పిన తరువాత నీవు ఆమెను వివాహమాడిన తరువాత భార్య అని నీవు ఆ సంబంధమును అనుభవించటానికి పూనుకుంటున్నావు. పూర్వము ఆమె ఎవరు? ఒక్కొక్కరికి పుట్టుట యందుగాని, గిట్టుటయందుగాని ఎట్టి సంబంధము కూడను లేనప్పుడు ఇట్టి సంబంధము నిత్యసత్యమైన సంబంధమని భావించుట, ఇది ఒక భ్రాంతియేగాని వేరొకటి కాదు. ప్రవాహములయందు అనేక చెట్టుకొమ్మలు కొట్టుకొని వచ్చి మధ్య మధ్య కొన్ని కొన్ని ప్రాంతములలో అవి రెండును చేరుతూ, తిరిగి విడిపోతూ సంబంధ అనుబంధములను, సంయోగ వియోగములను ఈ రెండు కఱ్ఱలు అనుభవించటం ప్రాకృతమైన అనుభవము. ఒక్క సంసారమునకు సంబంధించిన చెట్టులో పుట్టిన బిడ్డ భార్యవంటిది. మరొక సంసారమునకు సంబంధించిన మరొక చెట్టులో పుట్టిన బిడ్డ భర్తవంటివాడు. ఈ రెండు కొమ్మలు ఆ సంసారమనే వృక్షమును వీడి ఈ జీవితమనే ప్రవాహములో చేరి మధ్య మధ్య సంయోగ వియోగములతో ఈ సంకర్షణాత్మక మహత్తర తరంగమైన సాగరమందు ఈదుతూ ఉంటుంటారు. ఈ భార్యభర్తలు మధ్యకాలములో చేరిన వారేగాని, వీరు ఆదికి గాని అంత్యమునకు గానీ యేమాత్రము సంబంధులు కారు. కనుక వీరి నిమిత్తమై మీరు భ్రాంతిని పడి నీ స్వస్వరూపమును దూరము చేసుకొనకు బిడ్డా అని శంకరుల వారు "కాతేకాంతః" అనగా ఎవరు నీ భార్య అని ప్రశ్నించారు. ఎవరు నీ పుత్రుడు? కేవలము ఒక జన్మాంతర కర్మఫలితము చేత, ఋణానుబంధము వలన నీకు యితను బిడ్డగా పుట్టినాడేగాని యితనికి నీకు ఎట్టి సంబంధము లేదు. భాగవతమునందు దీనినే ఒక విధమైన హాస్యాస్పదముగా ఆస్తి నిమిత్తమై వచ్చిన వాడే యీ బిడ్డ, ఆత్మ నిమిత్తమై వచ్చినవాడు కాదని ప్రబోధించింది.

'సుతులు ఋణస్థులు' అని దీనికి ఒక పెద్ద బిరుదునిచ్చింది. మానవుడు మరణించిన

sri sathyasai vachanamrutam

తరువాత తన ప్రాప్తానుసారంగా సుఖదుఃఖములను అనుభవించి తదుపరి మేఘముల ద్వారా వర్షములో ప్రవేశించి, ఆ వర్ష బిందువుల ద్వారా పంటలో చేరి, ఆ పంటనుండి తల్లిదండ్రులలో చేరుకొని ఆ తల్లిదండ్రుల ద్వారా ఈ జగత్తులో ఒక స్వరూపాన్ని పొందుతున్నాడు. ఇది జన్మాంతర సంబంధము చేత, ఋణానుబంధంగా ఏర్పడినదేగాని, తండ్రి కొడుకు అనేది దేహ సంబంధమే గాని ఆత్మకు తల్లిదండ్రుల సంబంధము ఏమాత్రము లేదు. ఈ వ్యక్తిని నీవు ఎవరు, ఎక్కడనుండి వచ్చావు అని ప్రశ్నించినప్పుడు తాను ఏమి చెప్పగలడు? తాను ఎవ్వడో, ఎక్కడి నుండి వచ్చెనో, ఎంతమందికి తండ్రి ఆయెనో, ఎంత మందికి కుమారుడు ఆయెనో, ఎంతమందికి భర్త ఆయెనో, ఎంతమందికి సోదరుడాయెనో, ఎంత వయస్సో ఏ జన్మమున ఏవిధమైన సంబంధము తాను సంపాదించుకొనెనో యివన్నీ చెప్పటం సాధ్యము కాదు. మన పుట్టుక మట్టి నుండి రావటం చేత మనవలె సర్వజీవులు పుట్టటం చేత మట్టిపెళ్లకు, మట్టిపెళ్లకు ఎట్టి సంబంధమో ఈ మానవత్వానికి మానవత్వానికి అట్టిదే సంబంధము.

**మట్టిలోనె పుట్టి మట్టిలోన పెరిగి**
**మట్టి ఎరుంగరె మందమతులు**
**బ్రతుకులన్నియు మట్టి భవబంధములు మట్టి**
**సంసారమది మట్టి చావు మట్టి మాయమట్టి**
**మాయ మట్టికింత మాయలో పడనేల?**
**తల్లిదండ్రులెవరు? తనయులు మరి ఎవరు?**

మిత్రులెవరు? యిలను శత్రులెవరు? ధనములెవ్వారివి? ధాన్యములెవ్వరివి గృహములెవ్వరివి గేస్తులెవరు? మనమెవ్వరము? పూర్వమందెచ్చటనుంటిమో తిరిగి ఎచ్చటుందుమో తెలియలేరు.

ఇట్టిమాయ సంబంధమైన ఈ జగత్తునందు మమతలను పెంచుకొని మాధవుని దూరము చేసుకొని దివ్యత్వమునకు అతిదూరమై ఈ బంధమునకు లోబడి మన జీవితమును కేవలము అశాంతిమయమైన జీవితముగా అభివృద్ధి చేసుకుంటున్నాము. కనుక, దేహ సంబంధమైన అనుబంధములుగాని, ప్రతి బంధములుగానీ సత్యముగా మనము భావించకూడదు. ఉన్నంతవరకు మన కర్తవ్యాన్ని నిర్వర్తించుకునే ప్రయత్నమునకే మనము సంసిద్ధులు కావాలి. కాని కాయమునకు కాయము ఎట్టి సంబంధము శాశ్వతముగా ఉండటానికి వీలుకాదు.

srisathyasaivachanamrutam

**దేహము పాంచభౌతికము దేహముకూలక తప్పదెప్పుడున్**
**దేహినిరామయుండు గణుతింపగదేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబుజూడ ఆ**
**దేహియె దేవదేవుడు మదిన్ తలపోయగ ఆత్మరూపుడౌ**

దీనికి ఒక చిన్న కథ : ఒకానొక దినము రాజకుమారుడు వేటాడు నిమిత్తమై అరణ్యములో సంచరిస్తూ వచ్చాడు. ఇతను అరణ్యములో సంచరించి, అలసిపోయి, దాహనిమిత్తమై అనేక ప్రాంతములంతా వెతుకుతూ ఒక ఆశ్రమాన్ని చేరుకున్నాడు. ఆశ్రమము చేరిన తక్షణమే అతని రూప సౌందర్యము ఆశ్రమ వాసులు గమనించి అతనిని చక్కగా స్వాగతము చేసి అతనికి చల్లని నీరు, తీయని పండ్లు యిచ్చి విశ్రాంతి నిమిత్తమై ఒక చక్కని ప్రదేశమును అప్పజెప్పారు. ఆవిధమైన విశ్రాంతి నిమిత్తమై ఏర్పరచిన ప్రదేశమందు ఆ రాజకుమారుడు నివసించక ఈ ఆశ్రమ పెద్దను దర్శించాలని కోరాడు. తక్షణమే ఆ రాజకుమారుని, ఆశ్రమములో అనేక పెద్దలు ఉండినప్పటికిని, ఆశ్రమ అధికారియైన పెద్దస్వామి చెంతకు తీసుకుని వెళ్లారు. అక్కడికి వెళ్లిన తక్షణమే స్వాములవారు 'నాయనా! నీవు ఎవరు?' అని ప్రశ్నించాడు. 'జితేంద్రియ రాజ్యమునుండి నేను వచ్చాను' అన్నాడు. 'నీ పేరు ఏమిటి?' అన్నాడు. 'జితేంద్రియ రాజకుమార్' అన్నాడు. 'మీ తండ్రిగారి పేరేమిటి?' అడిగాడు. 'జితేంద్రియ మహారాజ్' అన్నాడు. 'మీ రాజ్యప్రజలు ఏవిధంగా ఉంటున్నారు? అడిగాడు. 'అందరు జితేంద్రియ ఆనందాన్ని అనుభవిస్తున్నారు' అన్నాడు. 'సరి ఈ స్వాములవారికి సందేహము వచ్చింది. జితేంద్రియులనగా యింద్రియములను జయించినవారు గాని, ఇంద్రియములను నిగ్రహించక రాజసిక భావములతో పరిపాలన సల్పుతూ ప్రజలను అనేకరకములైన అదుపులో ఉంచుకున్నవారు జితేంద్రియ మహరాజు, జితేంద్రియ రాజకుమార్, జితేంద్రియ ప్రజల, జితేంద్రియ రాజ్యము అని చెప్పటానికి ఏమాత్రము సాధ్యము కాదు. ఈ నామము తగిన సార్ధకత వీరిలో ఉన్నదా లేదాయని పరీక్షించే నిమిత్తమై ఆ రాజకుమారుని, ఆ ఆశ్రమములో ఉండమని, 'నాయనా! నీ రాజ్యమునకు దారి ఏదని చక్కని అడ్రస్సంతా తీసుకొని ఆ స్వాములవారు బయలుదేరారు. అంతటితో పోక, ఈ దుస్తులను వదలి ఈ ఆశ్రమములో నున్నంతవరకు మా కాషాయ వస్త్రములు ధరించి నేను

sri sathyasai vachanamrutam

వచ్చునంత వరకు ఆశ్రమములోనే ఉండమని కోరాడు. అతను జితేంద్రియ రాజకుమారుడు కనుక ఎట్టి భేదములు లేక తన డ్రస్సు వదలి కాషాయ వస్త్రము ధరించి ఆ స్వాములవారి ఆజ్ఞ ప్రకారము ఆ దుస్తులు ఆయనకు అందించారు. దానిని తీసుకొని కొంత దూరము వెళ్లిన తరువాత రాజకుమారుని వస్త్రముపై కొంత ఎరుపు రంగు (రక్తపు చుక్కలవలే కనిపించునట్లు) చల్లి దానిని మూటకట్టుకొని స్వామి వారు ఆ రాజ్యమునకు బయలుదేరారు. రాజ్యమునకు వెళ్లి సింహద్వారము వద్ద నున్న జవానులతో స్వాములవారు వచ్చారు, తన కుమారుని నిమిత్తమై చాలా దుఃఖపడుతున్నాడు, రాజకుమారుని వార్త రాజునకు చెప్పుటకై వస్తున్నాడు అని చెప్పి వార్తను పంపించాడు. అతను వెళ్లి తక్షణమే ప్రధానమంత్రిని చూచాడు, ప్రధాన మంత్రిని చూచి, 'నాయనా! నీ రాజకుమారుడు పులివాతబడి ప్రాణములు వదిలాడు. అతని దుస్తులు గుర్తు నిమిత్తమై నేను తెచ్చాను. కనుక ఈ వార్త రాజునకు అందించుటకు వచ్చానని తాను చెప్పాడు. ఆ మంత్రి యితను చెప్పిన మాటలకు యేమాత్రము మార్పుచెందక చిరునవ్వుతో, 'తాము ధరించిన కాషాయ వస్త్రము, ఈ రాజకుమారుని మరణమునకు మీరు యింత విచారించటము హాస్యాస్పదముగా వుంది. అయినా మీ అభీష్ట నిమిత్తమై రాజుచెంతకు తీసుకొని వెడతానని అతనిని తీసుకుని వెళ్లాడు. వెళ్లిన తక్షణమే రాజును దర్శించి ఆ దుస్తులు రాజునకు అప్పజెప్పి గొల్లున యేడ్చాడు. ఏడ్చిన తక్షణమే రాజు ఫక్కున నవ్వాడు. 'నాయనా! సాయంకాలమందు ఒక వృక్షముపైన అనేక పక్షులు వచ్చి వాలుతుంటాయి. ఆ వాలినంత మాత్రమున ఆ వృక్షమునకు ఆ పక్షులకు ఎట్టి సంబంధము లేదు. తెల్లవారిన తక్షణమే ఏఏ పక్షి ఏఏ దిశకు వెళ్లాలని సంకల్పించుకుంటుందో ఆయా పక్షులు లేచి వెడుతుంటాయి. ఒక పక్షి అని చెప్పటానికి వీలుకాదు. ఒకదానికొకటి సంబంధము లేదు. అదేవిధముగా నా యొక్క సంసారమనే వృక్షముపైన నేను, నా భార్య నా కుమారులు, నా మనుమలు నా కోడండ్రు మనుమరాళ్లు యింతమంది అనేటువంటివిగా వచ్చి వాలినాయి. నేడు ఆ పక్షి వెళ్లిపోయింది. రేపు, మరునాడు ఏ పక్షి ఎక్కడకు వెడుతుందో, యింత మాత్రమునకే నీవు యింత విచారించటము చాలా హాస్యాస్పదముగా వుంటున్నాది. ఇంత సత్యాన్ని నీవు గుర్తించలేనివాడు నీకు ఈ కాషాయము వ్యర్థం' అన్నాడు ఆ మహారాజు. సరి! రాజుకు ఆ

కుమారునిపై ఏమైనా విరక్తి కలిగిందో ఏమిటో, ఆ కుమారునికి రాజ్యము కట్టటము యిష్టము లేదో యేమిటో, తనకు యింకొక భార్య యింకొక కుమారుడు వున్నాడేమో అనే ఉద్దేశ్యముతో యీ సన్యాసి వేరు వేరు భావములు అభివృద్ధి చేసుకొని ఈ రాజు యిట్ల ఉండని, తల్లి దగ్గరకు పోయి చెప్పినప్పుడు నవమాసములు మోసి పెంచి పెద్దచేసిన తల్లికి కంటిధారలు రాకుండా వుండునా, ఈ తల్లి బాధపడకుండా వుండునా అని రాజమాతను చూడటం కోసమని తాను తిరిగి అంతఃపురమునకు బయలుదేరి వెళ్లాడు. అంతఃపురములో దాసీలు ఆ సన్యాసిని రాజమాతవద్దరకు తీసుకొని వెళ్లారు. రాజమాతకు తీసుకొని వెళ్లిన తక్షణమే ఆ దుస్తులు రాజమాతకు అప్పజెప్పి 'తల్లీ! నీ కుమారుడు బెబ్బులి వాతపడి ప్రాణములు వదిలాడు' అని గట్టిగా ఏడ్చాడు. అప్పుడు రాజమాత, 'సన్యాసీ! ఈ విచారమునకు ఏమాత్రము కారణము లేదే. ఏదో సత్రములో, మార్గ మధ్యములో అనేకమంది ప్రయాణీకులు దిగుతుంటారు. ఆ సత్రములో దిగుతారు. వారు విశ్రాంతి తీసుకుంటారు. తిరిగి విశ్రాంతి తీసుకున్న తక్షణమే వారు చెందవలసిన స్థానమునకు, పోవలసిన స్థానమునకు తిరిగి ప్రయాణమై వెడుతుంటారు. అంతమాత్రమున ఒకరికి ఒకరికి సంబంధము ఏముంటున్నాది. ఈ జగత్తు అనేది ఒక సత్రము వంటిది. ఈ సత్రములో అనేక మంది ఒక్కొక్క రూములో చేరినాము. కాని అతను ఈనాడు బయలుదేరి వెళ్లినాడు తన స్వస్థానమునకు. మేము కూడా రేపు వెళ్లేవారమే గాని సత్రములోపల స్థిరముగా నివాసము చేసేవారము కాదు. ఇంతమాత్రము దానికే ఈ సన్యాసి యింత దుః ఖించటము హాస్యాస్పదమని' ఆ సన్యాసికి బుద్ధి చెప్పినట్టుగా తాను వాదించింది. సరి! ఈ తల్లి మారుతల్లిగా ఉండవచ్చునని ఆ సన్యాసి తిరిగి తాను ప్రాపంచిక వ్యామోహములో పడి తిరిగి రాజకుమారుని భార్య దగ్గరకు వెళ్లినప్పుడు ఏదో సుమంగళత్వం పాడైందని ఆమె అయినా కంటిధారలు కారుస్తుందేమోనని ఆ రాజకుమారుని భార్య దగ్గరకు వెళ్లటానికి ఆశించాడు. అక్కడికి వెళ్లి 'తల్లీ నీ మాంగల్యము ఈనాటితో నశించి పోయింది. నీ సుమంగళత్వము యీనాటితో క్షీణమైపోయింది. రూపము విధవత్వముగా మారవలసి వచ్చింది. కనుక ఈ వార్తను నీకు అందించటానికి వచ్చాను' అని ఆమె దగ్గర చెప్పి ఏడ్చాడు. ఆ రాజకుమారుని భార్య చాలా గట్టిగా నవ్వి, 'సన్యాసీ! ఒక అరణ్యములో వర్షముద్వారా,

sri sathyasai vahini

గాలిద్వారా, కొన్ని చెట్లు కొమ్మలు విరుగుతుంటాయి. తిరిగి అది ప్రవాహముగా వచ్చినప్పుడు ఆ ప్రవాహములో కొమ్మ ఒకటి వచ్చి చేరిపోతుంది. ఇంకొక అడవిలోపల ఎండకు ఎండి వానకు నాని గాలికి విరిగి అక్కడ పడిపోతుంటాయి. ఇలాంటి కొమ్మలు వర్ష ప్రవాహముచేత దానిలో కొట్టుకొని వచ్చి పెద్ద నది లోపల చేరిపోతుంటాయి. ఆ చేరినప్పుడు ఆ ప్రవాహవేగము పట్టి మధ్య మధ్య కలుస్తుంటాయి, మధ్య మధ్య విడిపోతుంటాయి. అదేవిధముగా నేను ఒక యింటి చెట్టుకొమ్మ, అతను ఒక యింటి చెట్టుకొమ్మ. ఈ రెండు కొమ్మలు ఈ జీవితమనే ప్రవాహములో చేరినాయి. కాని ఈ ప్రవాహము ఆనందమనే సముద్రములో చేరుతుంది. సముద్రము ఒక కొమ్మ ఒక భాగములో, మరొక కొమ్మ మరొక భాగములో వుండినప్పటికిని సముద్రము ఏకంగానే ఉంటుంటాది. కనుక యిరువురికి ఆనందమనే ఎడబాటు రాదు. ఈ కొమ్మలు వేరు వేరు ప్రాంతములలో నివసించవచ్చు గాని ఆనందమనే సాగరము అందరికి ఒక్కటే. కనుక, దీనికి యోచించవలసిన అవసరము లేదని ఆ సన్యాసికి బుద్ధి చెప్పింది. అప్పుడు ఈ సన్యాసి తనలో తాను విచారించాడు. రాజకుమారుడు చెప్పినట్లుగా జితేంద్రియ రాజ్యము జితేంద్రియరాజు, జితేంద్రియ రాజమాత, యిది సార్థకమైనదిగా వుంటున్నాదని ఆ వస్త్రములు అక్కడపెట్టి తిరిగి తన ఆశ్రమమునకు వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తరువాత రాజకుమారునియందు జితేంద్రియ తత్త్వము వున్నదా లేదాయని test చేయాలని ఒక సంకల్పము పుట్టింది. వెళ్లిన తక్షణమే 'నాయనా! కుమార్ రాజా! పరరాజులు నీ రాజ్యముపైబడి దానిని వశము చేసుకొని నీ తల్లిదండ్రులను అనేక రకములుగా హింసించి అడవుల పాలు చేస్తున్నారు. ప్రజలను కొట్టి హింసిస్తున్నారని వీరు యీ సమయములో యిక్కడినుండి రాజ్యమునకు వెళ్లు అని' చెప్పాడు. అప్పుడు రాజకుమారుడు నవ్వి 'రాజ్యము ఎవరిది? రాజు ఎవరు? ఎవ్వరికి యిట్టి సంబంధము లేదు. భగవంతుడు మహారాజు. భాగవతము యువరాజు. భక్తుడు కుమారరాజు. ఇట్టి వారికే నిజ సంబంధము. యిట్టి రాజ్యములన్నీ నీటి బుడగల వలంటివి. నేడు ఉండవచ్చును రేపు పోవచ్చును. కనుక దేహ సంబంధమైన రాజ్యములు సరైన రాజ్యములు కాదు. హృదయరాజ్యమునకు పట్టాభిషేకము కట్టుకున్న నా తండ్రి నేను, నా తండ్రితత్త్వము, పుత్రతత్వము కూడాను ఏకత్వమైనదేగాని ఈ దేహముతో తండ్రి

sri sathyasai vachanamrutam

పుత్రుడుగాని ఆత్మతత్వమునకు ఎట్టి సంబంధము లేదు కనుక మన అందరి రాజ్యము ఆత్మ సామ్రాజ్యమే అన్నాడు.

ఇదే సన్నివేశము భారతములో సంజయుని కూర్చుండబెట్టుకొని తన కుమారుని యొక్క చింతను అతనితో చెప్పుకుంటూ దుఃఖిస్తున్నది. సంజయా! మన కౌరవులలో అశ్వద్ధామ, కృపాచార్య, కృపణుడు ఈ ముగ్గురు మాత్రమే నిల్చిరి. పాండవులలో 5మంది, కృష్ణుడు అతని స్నేహితుడు ఏడుమంది మాత్రమే నిల్చిరి. వారివైపున 7మంది, మనవైపున 3మంది మాత్రమే నిల్చిరి. ఈ ఏడు, మూడు పదిగా వుంటున్నాది. పదిమందిని నిలిపి, ఎన్నియో వేలమందిని, లక్షలమందిని యీ యుద్ధము అనేది మ్రింగివేసె కదా అని పరితపిస్తున్నది. సంజయుడు అనగా యింద్రియములు జయించినవాడు అని. అమ్మా! ఈ పదిమంది యొక్క తత్వాన్ని పరమాత్ముడు లోకానికి వ్యక్తపరిచే నిమిత్తమై ఈ విధమైన లీలలు ఆడుతున్నాడు. 10 అనగా ఒకటి పక్కన సున్న. అనగా సున్న అనేది భూమికి ఆదర్శమైన రీతిగా మనకు ప్రదర్శిస్తూ వస్తున్నాది. భూమియొక్క ప్రతిబింబమే సున్నాకు ఒక అర్థము. కాని దీనిని ఒక జీరో అంటున్నాము. ఈ జీరోకు ప్రక్కలో ఒక హీరో ఉంటున్నాడు. ఆ god అనే వాని ప్రక్కన ఈ జగత్తనే సున్న పెట్టటం చేతనే 10 వచ్చింది. ఆ god అనే హీరో లేకపోతే ఈ జీరో జీరోనే అయిపోతుంది. కనుక ఈ జగత్తంతా కూడను ఒక అనిత్యమైనది, అశాశ్వతమైనది అసత్యమైనది. ఈ అసత్యమైనటువంటి జగత్తు సత్యమైన దైవము చేరటంచేతనే దీనికి కూడను ఒక విలువ వస్తుంటుంది. సత్యజీవితమును మనము అనుభవించుకోవాలనుకున్నప్పుడు సర్వేశ్వరునితో సన్నిహిత సంబంధాన్ని చేర్చుకోవాలి. అదే మన జీవితానికి పరమావధి అని సంజయుడు బోధించాడు. భూమి సున్న స్వరూపము, సూర్యుడు సున్న ఆకారము, చంద్రుడు సున్న ఆకారము. ఇంక ఏ ఆధారమైన స్వరూపములు నిరూపణ చేసినప్పటికిని అన్నీ కూడను ఒక సున్న ఆకారంగా వుంటున్నాది. నివసించే భూమి సున్న. ప్రకాశమునందించే సూర్యుడు సున్న, చల్లదనము అందించే చంద్రుడు సున్న. ఈ అందరూ సున్నలైనప్పుడు మన జీవితము సున్న కాక మరియేమిటుంటాది. కనుక మన జీవితమును ఒక సున్నగా భావించుకుని దానికి ప్రక్క ఒక దైవత్వమును చేర్చుకోవటంచేత మన జీవితము కూడను శాశ్వతమైనటువంటి, పవిత్రమైనటువంటి, విలువైనటువంటి స్థానాన్ని కూడను చెందుతుంటాది. విత్తనములో చెట్టు ఉన్నది. చెట్టులో విత్తనమున్నది. ఈ విత్తనము, చెట్టు అనాదులు. ఇవి ఎప్పటికిని

sri sathyasaivachanamrutam

వుండినటువంటివే. అలాంటి అనాదియైన సత్యమైన, నిత్యమైనది ఎప్పటికి నిత్యముగా వుంటుంటాది. ఈ రెండింటి యొక్క సత్యాన్ని గుర్తించటమే మన జీవితము యొక్క కర్తవ్యము. ఇదంతయు మాయ. ఈ మాయ అంటే యమాస మాయ అన్నాడు శంకరుడు. అనగా ఏది లేదో అదే మాయ అన్నాడు. దానికి మనము ప్రశ్నించవచ్చును. లేని దానిని మాయ అని చెప్పవచ్చును గాని ఇంత ప్రపంచము మనకు స్వరూపకంగా గోచరిస్తుండే సమయములో లేదని చెప్పటము ఎట్లా సాధ్యమవుతుంది! ఉన్నది లేదని చెప్పటమా! యిది మాయ కాదె, మనము అన్ని రకములైన శబ్దరూప రస గంధాదులతో అనుభవిస్తున్నప్పుడు యిది మాయ అని చెప్పటం సాధ్యం కాదె అని మనము కొంతవరకు విచారణ సల్పవచ్చు. దానికి శంకరులవారే చక్కని ఉదాహరణము చెప్పారు. కలలో చూచిన మేడలు మిద్దెలు కన్నులు తెరచిన లేవు కదా! తక్షణమే ఆ భోగములు ఎక్కడున్నాయి? అదేవిధముగా ఈ జాగ్రదవస్థ లోపల శబ్ద దర్శ రూప రస గంధాదులతో అనుభవిస్తున్నావు. తిరిగి యివి నిద్రావస్థలో లేవు కదా. కనుక, యిది పగటి కల, అది రాత్రి కల. రెండూ రెండు కలలే. కలలంతా కల్లలే అన్నాడు. కనుక, మన జీవితమనే దానిని యిది సత్యము, అది మిథ్యము అని చెప్పటానికి వీలు లేదు. మన జీవితములో ఏదో కొన్ని అనుభూతులు ఉండినంతవరకు మనము అది సత్యముగానే భావించుకొని ఆ సత్యమును, సత్యస్య సత్యమును, సత్యములోనున్న సత్యాన్ని గుర్తించుకునే ప్రయత్నానికి పూనుకోవటమే మనము ఈనాడు చేయవలసినటువంటి ప్రధాన ప్రయత్నము. కాన మనము దేహ సంబంధములుగాని, యింకేవిధమైన అనుబంధములు గాని ఉన్నంతవరకు మన కర్తవ్యము నిర్వర్తించుకునే ప్రయత్నానికే మనము పూనుకోవాలి గాని వాటిని ఒక ప్రత్యేకమైన సంబంధముగా మనము భ్రాంతిని పెంచుకొని దానిద్వారా మనము దుఃఖమునకు గురికావటము మానవత్వమునకు సరియైన మార్గము కాదు.

**"మాతానాస్తి పితానాస్తి నాస్తి బంధు సహోదరః**
**అర్థంనాస్తి గృహంనాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత"**

అని శంకరుల వారు మరొక తూరి హెచ్చరించారు.

srisathyasaivachanamrutam

**జన్మ దుఃఖం జరా దుఃఖం జాయాదుఃఖం పునః పునః**
**అంత్యకాలే మహాదుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత**

అన్నాడు. సంసారంలో వుండు కానీ సంసారం నీలోచేర్చుకోకు ఉండినంతవరకు మన కాయమును ఆరోగ్యవంతముగా పెట్టుకోవాలి. ఉండినంతవరకు మన మనస్సును నిశ్చలమైనదిగా పెట్టుకోవాలి. చలించని మనస్సును, భ్రమించని మనస్సును మనము అభివృద్ధి పరచుకొని శాశ్వతమైన ఆత్మానందమును అనుభవించుకునేటటువంటి యొక్క లక్ష్యములో మన జీవితమును అంకితము చెయ్యాలి. పరులచేత చిక్కి పడరాని కష్టములు పడునట్లుగా ఈ దేహమును కూల చేసుకోకూడదు. ఉన్నంతవరకు పరాధీనము కాక స్వశక్తితో తన కర్మను తాను చేసుకొనే శక్తిని కూడను మనము పెంచుకోవాలి. దేహము ఒక పడవవంటిది. ఇహము యిటువైపున, పరము అటువైపున మధ్యలో జీవితమే ఒక ప్రవాహము. ఈ జీవితమనే ప్రవాహమును దాటి పరము అనే గమ్యమును చేరే నిమిత్తమై దేహము అనే పడవను అందించినాడు భగవంతుడు. అయితే మధ్య మార్గములోపల ఈ పడవకు ఏమైన ప్రమాదము సంభవించెనా చాలా కష్టమవుతుంది. మనము గమ్యమును చేరలేము. ఎంతకాలము ఈ జలములో వుండినా ఎట్టి ప్రమాదము లేదు, కాని జలము పడవలో ప్రవేశించినా ప్రమాదము వస్తుంది. కనుక నీవు సంసారములో ఉండు, కాని సంసారమును నీలో చేర్చకుండా చూచుకో. ఈవిధమైన జీవితాన్ని నీవు గడిపితివా నీవే ఆత్మ స్వరూపుడవు. నీవే నిత్య సత్య స్వరూపుడవు. నీవే నిర్మల స్వభావుడవు. అలాంటి పరతత్వాన్ని మనం అనుభవించుకునే నిమిత్తమై శంకరులవారు ఈ శ్లోకాన్ని ఎవరు పుత్రుడు, ఎవరు భార్య, నీవు ఎవరు, ఎక్కడివాడవు అని ఒక మనస్సును బట్టి సాధించేటువంటి ప్రశ్నను వేసి ఆ జీవిత రహస్యాన్ని అంతా వెలుపల లాగాడు.

**(తేదీ 28-05-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahamrutam